రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ

ఎదులాపురం, మార్చి 13 : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వెంకటనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రం లోని కుమ్రం భీం భవనంలో ఐఎఫ్‌టీయూ (భారత కార్మిక సంఘాల సమాఖ్య) జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌తో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 14 తేదీన ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, వ్యవసాయ వ్యతిరేక నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సుభాష్, శేషారావ్, నర్సింగ్, జనార్దన్, దేవీదాస్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

ఎదులాపురం, మార్చి 13 : తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. మొల్ల మాంబ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం మోహన్‌బాబు మాట్లాడుతూ తెలుగులో రామయణం రాసిన గొప్ప మహిళ మొల్ల అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు నర్సింహులు, అశోక్, గంగారం, శంకర్, విఠల్, చందు, సత్యనారాయణ, మనోజ్ దేవన్న పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, మార్చి 13 : కవయిత్రి ఆతుకూరి మొల్లను ఆదర్శంగా తీసుకోవాలని లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. లక్కారం గ్రామంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకుడు తొగరి రఘు, నాయకులు మల్లయ్య, ఎగిడి శేఖర్, మారపాక రాజన్న, శేఖర్, రాజేశ్వర్, భూపతి, చంద్రశేఖర్, రవీందర్, కోల సత్తన్న, జాదవ్ రవి, రమేశ్, సురేశ్, సీతారాం, స్వామి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

పరామర్శ

బోథ్, మార్చి 13 : బోథ్‌కు చెందిన చట్ల చిన్నయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశ్విన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ మహేందర్, నాయకులు ఉన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

- ముగిసిన వ్యవసాయ పనులు
- పనులకు వస్తున్న కూలీలు

సాకెరలో తవ్వకం పనులు చేస్తున్న కూలీలు

బోథ్, మార్చి 13 : ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనులు దాదాపుగా ముగియడంతో కూలీలు పనులకు వెళ్తున్నారు. బోథ్ మండలంలోని 33 గ్రామ పంచాయతీ పరిధిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగి కింద సాగు చేసిన పంటలు దాదాపుగా చేతికందడంతో కూలీలు ఉపాధి పనులు చేయడానికి వెళ్తున్నారు. మట్టికట్టలు, గులకరాళ్లు ఏరివేత. సీసీటీ (కంటిన్యూ కాంటూర్ ట్రెంచెస్), ఎస్‌జీటీ (స్టాగ్డ్ ట్రెంచెస్) వంటి పనులు చేస్తున్నారు. ఎండలు ముదరడంతో తెల్లవారు జామునే పలుగు, పార, తట్టలు వెంట బెట్టుకొని పనులకు వెళ్తున్నారు. ఎంపీడీవో రమేశ్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో జగ్దేరావు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కూలీలు పనులకు వెళ్లేలా సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం 2,440 మంది వరకు కూలీలు పనులకు వస్తున్నారు. కొంత మంది కూలీలు వంద రోజుల పనిని పూర్తి చేసుకున్నారు. రైతులకు ఉపయోకరమైన మట్టి కట్టల పనులు పొలాల్లో చేయించుకోవాలని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఎండకాలం మొదలు కావడం, కూలీలకు మిగతా పనులు అందుబాటులో లేకపోవడంతో ఉపాధి పనులకు చేయడానికి ఉత్సాహం చూపుతున్నారు.

ఘనంగా భీమన్న జాతర

భీమన్న దేవుళ్ల విగ్రహాలు

బోథ్, మార్చి 13: నారాయణ్‌పూర్ (ధన్నూర్ (బీ) గ్రామ సమీపంలో కొలువైన భీమన్న దేవుళ్ల జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల క్రితం గంగనీళ్ల సాన్నానికి తీసుకెళ్లిన దేవుళ్ల విగ్రహాలను ఆలయంలో కూర్చుండ బెట్టారు. నారాయణ్‌పూర్, అందూర్, రఘునాథ్‌పూర్, మందబొగూడ, కుచ్చిరాలతండా, కుచులాపూర్, బోథ్‌తో పాటు ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా వెలిసిన దుకాణాల్లో చిన్నారులు సందడి చేశారు.

నీటి వసతి ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే

భీమన్న దేవుని జాతర సందర్భంగా వచ్చే భక్తుల కోసం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తాగు నీటి వసతి ఏర్పాటు చేయించారు. బోథ్ నుంచి నీటిని తెప్పించి అందుబాటులో ఉంచారు.

విద్యార్థికి సన్మానం

ఇచ్చోడ, మార్చి 13 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న డొబ్లే రిషికేశ్ రైల్వే కోచ్ రీ డిజైనింగ్ ఆవిష్కరణ జాతీయ స్థాయిలో మెప్పు సంపాదించిన సందర్భంగా బుధవారం భారత జాగృతి ఎన్జీవో ఆధ్వర్యంలో విద్యార్థిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్జీవో మండల కన్వీనర్ మైల మహేశ్ మాట్లాడుతూ రిషికేష్ ఆవిష్కరణ జాతీయ స్థాయిలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే మే 19వ తేదీన జపాన్‌లోని టోక్యో నగరంలో జరగనున్న సైన్స్ మేళాలో తన ప్రతిభను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో సభ్యులు సుంకే అనిల్ కుమార్, ప్రవీణ్, తొగరి శేఖర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానిస్తున్న ఎన్జీవో సభ్యులు

నీటి ఎద్దడి లేకుండా చూడండి

మాట్లాడుతున్నా ఎంపీపీ కేంద్రె న్యాను

గుడిహత్నూర్, మార్చి 13 : గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ కెంద్రె న్యాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పల్లెల్లో నీటి సమస్య లేకుండా చూడాలని, బోరింగ్‌లకు మరమ్మతులు చేయించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రూ.19 లక్షల నిధులు ఎక్కడెక్కడ వినియోగించారో ఎంపీటీసీలు తమ అభిప్రాయాలను వివరించారు. అనంతరం ఆ నిధులు ప్రాధాన్యత క్రమంగా పనులు చేపట్టాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఎంపీటీసీలు అంకతి సవిత, తులసీ, శగీర్‌ఖాన్, మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్కే జమీర్, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, ఏఈ గౌతం, అధికారులు పాల్గొన్నారు.

దొంగలు అరెస్టు : నగదు, బంగారం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న నగదు, బంగారంతో వివరాలు వెల్లడించిన డీఎస్పీ

ఎదులాపురం, మార్చి 13 : వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టూటౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. న్యూహౌసింగ్‌బోర్డుకు చెందిన మహ్మద్ మాయిజ్, మహలక్ష్మీవాడకు చెందిన రథన్, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ ఫయాజ్, ఖుర్షిద్‌నగర్‌కు చెందిన సయ్యద్ సుల్తాన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడి బంగారం, నగదును దొంగలించారు. బుధవారం ఉదయం మహాలక్ష్మీవాడ అండర్ బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గమనించిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.59వేలు నగదు, 6 తులాలు , 17 తులాల వెండి ఆభరణాలు, 10 లీటర్ల పొద్దుతిరుగుడు నూనె డబ్బాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సీఐలు అశోక్, ఫణిదర్, ఎస్ఐలు విష్ణువర్ధన్, జీవీ రమణా రెడ్డి కానిస్టేబుళ్లు సుధాకర్, నరేందర్, రమేశ్, నరేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల అధికారి సబిత

జైనథ్, మార్చి 13: గర్భిణులు రోగనిరోధక శక్తిని పెంచే పౌష్టికాహారం తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల అధికారి సబిత అన్నారు. బుధవారం మేడిగూడ గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారంపై గర్భిణులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నర్సమ్మ, మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్‌లు కృష్ణవేణి, కోటేశ్వర్, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్, గర్భిణులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనకు గురికావొద్దు

మాట్లాడుతున్న డాక్టర్ ఓం ప్రకాశ్

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 13 : పరీక్ష సమయంలో విద్యార్థులు భయాందోళనకు గురికావద్దని మానసిక వైద్యులు (రిమ్స్) డాక్టర్ ఓం ప్రకాశ్, ఎస్ఐ నవీన్ అన్నారు. బుధవారం సిరికొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి ఆహారం, నీరు తీసుకోవాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌వో సంధ్యారాణి, ఏఎస్ఐ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

గిత్తే మనోహర్(ఫైల్)

ఇంద్రవెల్లి, మార్చి 13: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌కు చెందిన ఎంపీటీసీ గిత్తే ఆశాబాయి భర్త మనోహర్(44) ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం ఎస్ఐ సునీల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీటీసీ ఆశాబాయి భర్త మనోహర్ తన సొంత కారు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు నెలల క్రితం మనోహర్ ఛాతినొప్పితో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి వైద్యం అందించడంతో కొంత మేరకు నొప్పి తగ్గింది. మళ్లీ వారం రోజుల నుంచి ఛాతినొప్పి వస్తుందని, తాను చనిపోతానేమోనని బెంగతో బాధపడుతుండేవాడు. బుధవారం ఇంట్లో ఆయన నిద్రలో ఉండగా భార్య ఆశాబాయి ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు ముగించుకొని ఆశాబాయి ఇంట్లోకి వెళ్లి చూడగా తన భర్త మనోహర్ నైలాన్ తాడుతో ఇంట్లోనే ఉరేసుకొని విగాతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సునీల్ సంఘటన స్థలానికి చేరుకొని మనోహర్ ఆత్మహత్యకు గల కారణలు అడిగి తెలుసుకున్నారు. మృత్యుడి భార్య ఆశాబాయి ఫిర్యాదు మేరకు పంచనామ నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృత్యుడికి భార్యతో పాటు కొడుకు సాయినాథ్ ఉన్నాడు.

నీటి సమస్య రాకుండా చూడాలి

నల్లా నీరు పరిశీలిస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్ రూరల్, మార్చి 13: గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. బుధవారం తేజాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. నీటి సమస్యల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎండకాలంలో మారుమూల గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్న చోట అధికారులు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్లను వేయుటకు అంతర్గత రోడ్లను పరిశీలించారు. నాణ్యత లోపించకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆత్రం లచ్చు, ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఈజీఎస్ ఏపీవో రజినీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కేసులు

సుంగపూర్‌లో ఇప్పపువ్వు పాకాన్ని పారబోస్తున్న ఎస్ఐ రవికిరణ్, సిబ్బంది

నార్నూర్, మార్చి 13 : నాటుసారా తయారు చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని నార్నూర్ ఎస్ఐ రవికిరణ్ అన్నారు. సుంగపూర్ గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారంతో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. రాథోడ్ తుకారాం ఇంట్లో పది లీటర్ల నాటుసారా, ఇప్పపువ్వుపాకం, బెల్లం స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పాకాన్ని పారబోశారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 13: సిరికొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సునీల్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలను సాధారణ పరీక్షలాగే రాయాలని ఆందోళనకు గురి కావద్దన్నారు. ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, చంద్రకాంత్, భాస్కర్, లక్ష్మి, అనిల్, సీతారాం, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఎం సునీల్

అభివృద్ధి పనులకు భూమి పూజ

భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ సునీతారోహిదాస్

బోథ్, మార్చి 13: చింతలబోరి గ్రామంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ రూ.3 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎంపీటీసీ సునీతారోహిదాస్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ముండే ఈశ్వర్, సంతోష్, శ్రీధర్, విజయ్, సత్యనారాయణ, సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేస్తా

వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 : ఈపీఎఫ్ కమిషనర్ తానయ్యను బుధవారం కరీంనగర్‌లో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఆదిలాబాద్ కమిటీ సభ్యులు కలిశారు. కార్మికుల సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. 16 నెలలుగా కార్మికుల నుంచి ఈపీఎఫ్ డబ్బులు కోతలు విధిస్తున్న కార్మికుల ఖాతాలో జమ చేయని విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఈఎస్ఐ నిధుల దుర్వినియోగం జరిగిన తీరును వివరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఎం, ఉపాధ్యాయుడికి సన్మానం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 : ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంగ్లిష్‌లో కథలు రాసి వాటిని పుస్తక రూపంలో మలిచారు. విద్యార్థులకు పుస్తక రూపంలో ఆవిష్కరణకు సహకరించిన ఉపాధ్యాయులను బుధవారం పీఆర్టీయూ తెలంగాణ తరపున పాఠశాల హెచ్ఎం గంగన్న, ఉపాధ్యాయులు గంగన్నను డీఈవో ప్రణీత శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్, రాహుల్ పాల్గొన్నారు.

కొలత ప్రకారం పనులు చేయాలి

బజార్‌హత్నూర్, మార్చి13: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని జిల్లా అబ్‌సర్‌డ్‌మెన్ అధికారి వీణ అన్నారు. బుధవారం మండలంలోని దేగామ, దిగ్నూర్, చందునాయక్‌తండా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలకు సూచించారు. ఆమె వెంట ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులకు చేయూత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 : ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టీ) గ్రామంలో భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్, పొచ్చిరాం, సురేందర్, అశోక్, అంబదాస్, రాజేశ్వర్, యూత్ సభ్యులు శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

గుడుంబా తయారిదారులపై చర్యలు

ఉట్నూర్, మార్చి 11: గుడుంబా తయారిదారులపై చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎక్సైజ్ ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. బుధవారం పెర్కగూడ గ్రామంలో శంకర్ ఇంటిపై దాడులు చేసి నాలుగు లీటర్లు, లక్కారంలోని కాత్యాయని ఇంట్లో 4 లీటర్లు, మండల కేంద్రంలోని శాంతినగర్ నివాసి వినోద్ ఇంట్లో 2 లీటర్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గంగారెడ్డి, అక్బర్‌హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బోథ్, మార్చి 13 : విశ్వకర్మల అభివృద్ధి కోసం విశ్వబ్రాహ్మణ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, బోథ్ మండల ఉపాధ్యక్షుడు మెడిచెల్మ ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మలు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు.

108లో ప్రసవం

భీంపూర్, మార్చి 14 : మండలంలోని రాజులకొరి గ్రామానికి చెందిన ఆత్రం జంగుబాయికి మూడో కాన్పులో భాగంగా బుధవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో గర్భిణిని తీసుకొని దవాఖానకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆశకార్యకర్త సీతాబాయి, ఏఎన్ఎం విజయలక్ష్మి సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. తల్లీబిడ్డ పీహెచ్‌సీలో క్షేమంగా ఉన్నారని వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నామని వైద్యాధికారి నిఖిల్‌రాజ్, హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్ తెలిపారు.

568 మంది విద్యార్థులు గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఫస్ట్ ఇయర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 9388 మంది విద్యార్థులకు గాను 8820 మంది పరీక్ష రాశారు. 568 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీంద్రకుమార్ పేర్కొన్నారు.

చదువుతోనే భవిష్యత్

ఉట్నూర్ రూరల్, మార్చి 13: చదువుతోనే పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు అన్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ హరిత ఆదేశాలతో మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో వారు పర్యటింటారు. పిల్లలు, తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బుర్ర మానస, చౌహాన్ సుగుణ, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన ఉండాలి

జైనథ్, మార్చి 13 : సమాజంలోని ప్రతి పౌరుడు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా సీనియర్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. బుధవారం మేడిగూడ(ఆర్) గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో మేడిగూడ(ఆర్) వీడీసీ చైర్మన్ క్యాతం రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సీమా శ్యాంసుందర్, నాయకులు వినోద్, శంకర్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

సిల్వర్ రాజుకు డాక్టరేట్



డాక్టరేట్ ప్రదానంలో సిల్వర్ రాజు

తాంసి, మార్చి 13 : భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన సిల్వర్ రాజు బుధవారం రాత్రి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పొందారు. చిన్న రైతు కుటుంబం సిల్వర్ చిన్న గంగన్న– ఆశమ్మ దంపతుల పెద్ద కుమారుడు రాజు ప్రాథమిక నుంచి పీహెచ్‌డీ వరకు సర్కారు విద్యాలయాల్లోనే చదివాడు. ఎంఎస్‌సీ ఆర్గనిక్ కెమిస్ట్రీలో గోల్డ్ మెడల్ సాధించిన రాజు ఎస్‌సీఐఆర్–ఐటీసీటీతో పీహెచ్‌డీ చేశారు. ఈ అంశంలో సూపర్‌వైజర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ ఉన్నారు. కెమిస్ట్రీలో పోస్ట్ డాక్టొరల్ చేసి మంచి శాస్త్రవేత్తగా నిలబడాలన్నది తన లక్ష్యమని రాజు పేర్కొన్నారు. రాజుకు డాక్టరేట్ రావడంతో కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

24న రజక సంఘం ఎన్నికలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13: రజక సంఘం ఆదిలాబాద్ పట్టణ శాఖ ఎన్నికలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు అడ్‌హాక్ కమిటీ సభ్యులు సంతోష్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎన్నికల షెడ్యూల్ వివరాలు వెల్లడించారు. నామినేషన్ వేసే వారు రజక సంఘంలో సభ్యులై, ఆదిలాబాద్ పట్టణ వాస్తవ్యులై ఉండాలని తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 19న విత్ డ్రా ఉంటుందని తెలిపారు. సమావేశంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

16న క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

ఉట్నూర్, మార్చి13: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 16వ తేదీన ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో తుది ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బుగుప్తా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు బుధవారం ఒక ప్రక